క్లుప్తంగా

రూ.లక్ష వితరణ



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న సంతోష్

హిరమండలం: మేజర్ పంచాయతీలోని దేవర శెట్టి వీధిలో ఉన్న సత్యసాయి మందిరం పునర్ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త అంధవరపు సంతోష్ రూ.లక్ష వితరణ చేశారు. సత్య సాయి సేవా సంఘం అధ్యక్షుడు అంధవరపు అబ్బాయికి రూ.లక్ష చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ తన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ సాయం అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మందిరం నిర్మాణానికి తనవంతు సాయం అందిస్తానన్నారు. అంధవరపు బుచ్చబ్బాయి, బెహరా సురేష్, కూర్మనాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు

నరసన్నపేట: మన చుట్టూ ఉన్న వారిలో విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత అన్నారు. మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి వారిని విభిన్న ప్రతిభావంతులు అంటారు, ప్రభుత్వం వారికి ఎటువంటి సౌకర్యాలు అందిస్తుంది, తదితర విషయాలను వివరించారు. అటువంటి వారికి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. హెచ్‌ఎం హర్షవర్ధన్ శర్మ, పీహెచ్‌సీ, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన



జల్ జీవన్ పనులు పరిశీలిస్తున్న డీఈ సుబ్బలక్ష్మి

పొందూరు: మండలంలోని రాపాక పంచాయతీలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.వి.సుబ్బలక్ష్మి సోమవారం పరిశీలించారు. రాపాకలో రూ.1.16 కోట్లు, ఇల్లయ్యగారిపేటలో రూ.54 లక్షలు, వావిలపల్లిపేటలో రూ.54 లక్షలతో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఈ రాజు, కూటమి నాయకులు ఉన్నారు.

రోడ్డుపైనే ఇసుక నిల్వ



తుంగపేట-గోరింట రహదారిలో నిల్వ చేసిన ఇసుక

పొందూరు: మండలంలోని తుంగపేట–గోరింట రహదారిలో ఇసుక అక్రమంగా నిల్వ చేశారు. ప్రధాన రహదారిలో ఇసుకను నిల్వ చేయడంతో వాహనదారులు రాత్రి సమయాల్లో జారిపడిపోయే ప్రమాదం ఉంది. ఇసుకను ఎక్కడబడితే అక్కడ అక్రమంగా నిల్వ చేస్తున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు రేపు

పాతపట్నం: ఈ నెల 12వ తేదీన ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గ ఆలయ హుండీని లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి లెక్కింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్ పాటించి హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాతపట్నం బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ (ఇంగ్లిష్ మీడియం)లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన సోమవారం తెలిపారు. ఈ నెల 7 నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని, మార్చి 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన ఉదయం పది గంటలకు, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలనికి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటా కేటాయిస్తామన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 80 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

సాంకేతిక సమస్యలతో.. సతమతం

- పలు రకాల యాప్‌లతో అంగన్‌వాడీల అవస్థలు
- చిన్నారుల వివరాల నమోదుకు ఆటంకం
- వేతనాల్లో కోత అంటూ బెదిరింపులు



అంగన్‌వాడీ కేంద్రం

జలుమూరు: స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలకు అందించే సేవల్లో నిత్యం ఆటంకం కలుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థలో ఉన్న సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రీస్కూల్ పిల్లల వివరాలు ఎప్పటికప్పుడు 'పోషణ్ ట్రాకర్' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. పలు సాంకేతిక సమస్యల కారణంగా ఫోన్లు తరచూ మొరాయిస్తున్నాయి. అంగన్‌వాడీలు రోజువారీ కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న చిక్కీలు, గుడ్లు, బాలామృతం, పీచు పదార్థాలు కలిగిన కూరలు ఆహారంలో తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా మాతా, శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వం లక్ష్యం.

పనిచేయని ఫోన్లు..

మూడు నెలల నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన ప్రీస్కూల్ పిల్లల వివరాలు ప్రతీరోజు హాజరువేయాల్సి ఉంది. హాజరును ఫొటో తీసి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలి. ఏ రోజుకారోజు చిన్నారుల గ్రూప్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కేంద్రానికి వచ్చిన తరువాత ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల్లోపు ఇది పూర్తి చేయాల్సి ఉంది. రెండు, మూడు వారాల్లో ఇవి మార్పులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు సక్రమంగా పనిచేయడంలేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదేళ్ల క్రితం వీరికి ఇచ్చిన ఫోన్‌లు చాలా మంది పక్కన పెట్టి సొంతంగా కొనుగోలు చేసిన ఫోన్లు వినియోగిస్తున్నారు. వీటి వల్ల వీరికి ఆర్థిక భారం పడుతోంది. కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు వినియోగించడంతో స్టోరేజ్, రామ్ తక్కువగా ఉండడంతో హ్యాంగ్ అవుతున్నాయి. ఇవి మరమ్మతులకు గురైతే వీటి స్థానంలో కొత్తవి ఇవ్వడం లేదు.

పట్టించుకోని అధికారులు..

సాంకేతిక సమస్యలను సరి చేయాల్సిన అధికారులు అటువంటి ప్రయత్నాలు ఏమీ చేయడం లేదు. యాప్‌లో పిల్లల వివరాలు నమోదు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామని బెదిరిస్తున్నారు. యాప్‌లలో లోపాల వల్ల వర్కర్లు కేంద్రంలో ఉన్నప్పటికీ లొకేషన్ స్థానికంగా చూపించకపోవడంతో వివరాలు ఆ యాప్‌లో నమోదు కావడంలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుస్తీ పడుతున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వర్కర్లు ఆరోపిస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు				
ప్రాజెక్టు	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
సారవకోట	193	1,843	2,738	4,312
నరసన్నపేట	230	1,800	6,010	7,810

యాప్ భారాన్ని తగ్గించాలి



అంగన్‌వాడీ వ్యవస్థపై ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. అదనపు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీనికి తోడు యాప్‌ల పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి. అన్నీ యాప్‌లు తొలగించి కేవలం రెండే యాప్‌లే పెట్టి పని భారం తగ్గిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర లేదు. అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– కె.సురేష్‌బాబు, సీఐటీయూ, జిల్లా కమిటీ సభ్యులు

జల్ జీవన్ మిషన్ అమల్లో వైఫల్యం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు తీసుకువచ్చిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తాగునీటి ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని పలు సర్వేల్లో స్పష్టం కావటంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు తాగునీరు అందించే ఈ పథకాన్ని మూలన పడేసిందన్నారు. తాగునీటి కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో 70 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించేలా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేశారని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయలేని దుస్థితిలో ఉందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు 360 పనులు పూర్తి చేసేందుకు రూ.62 కోట్లు జగనన్న ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 2,200 కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉండగా గతేడాది జరిగిన ఎన్నికల ముందే 1,600 కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన కుళాయిలు ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా కలుషిత నీటినే గ్రామీణ ప్రాంత ప్రజలు తాగేందుకు, వంట అవసరాలకు వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటం లేదని, కనీసం తాగునీరు అయినా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేషన్ సరకులకు భద్రత ఏదీ?



రేషన్ సరకుల గోదాం

సరుబుజ్జిలి: మండల పౌర సరఫరాల గోదాం నిర్వహణ సక్రమంగా లేక పోవడం వలన సరకులకు భద్రత లేకుండా పోతుందని పలువురు రేషన్ డిపో డీలర్లు వాపోతున్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చి సరకులను ఈ గోదాంలో సరుబుజ్జిలి మండలం నుంచి 41 రేషన్ డిపోలు, బూర్జ 33, ఎల్ఎన్‌పేటకు 36 డిపోలకు, ఆమదాలవలస 1, జలుమూరు, హిరమండలాల్లోని 6 డిపోలకు చెందిన బియ్యం, పామాయిల్, కందిపప్పు నిల్వ చేసి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రేషన్ డిపోలు తరలిస్తారు. గోదాం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఫ్లోరింగ్, పైకప్పు, గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా పాడయ్యాయి. సరకులు నిల్వ చేసే సమయంలో నాణ్యత దెబ్బతింటున్నాయని డీలర్లు తెలిపారు. ఇదే విషయమై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. సరకుల నిల్వలో అన్ని భద్రతా చర్యలూ తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

అన్నదానం



నరసన్నపేట మండలంలోని గుండవల్లిపేటలో ఉమాస్వయంబేశ్వర స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆది, సోమవారాల్లో వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. సోమవారం చేపట్టిన కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. స్వయంబేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త పంచిరెడ్డి విశ్వనాథం(బుజ్జి) ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు.

– నరసన్నపేట

తనిఖీ



హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వి.బాలమురళీకృష్ణ తనిఖీ చేశారు. ఇన్, అవుట్ రోగులతోపాటు ఓపి, రికార్డులు, నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అత్యవసర సమయంలో రోగులకు అందించాల్సిన ఆక్సిజన్ సిలిండర్లను పరిశీలించారు. నులి పురుగులు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, స్థానిక వైద్యాధికారి సాయి గీత, వైద్య సిబ్బంది ఉన్నారు.

– హిరమండలం

అవగాహన



కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బ్రైట్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు అన్నారు. నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత(బోర్డు) పాఠశాలలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలు.. ఎలా గుర్తించాలి.. వ్యాధి నిర్ధారణ అయితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది వివరించారు. అనంతరం విద్యార్థులకు కుష్టు వ్యాధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ జరిగింది. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బాబూరావు, ప్రసాదరావు, వై.రవికుమార్ పాల్గొన్నారు.

– నరసన్నపేట

అలంకారప్రాయం



సారవకోట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ న్యాయ సలహా కేంద్రం అలంకార ప్రాయంగా మారింది. ప్రతీ సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐ, ఏపీఎంలతో కూడిన కమిటీ సభ్యులు గ్రామాల్లో మహిళలు కుటుంబ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేశారు. ఇటువంటి కేంద్రం ఉందని, సమస్యలను పరిష్కరించుకునేందుకు సలహాలిస్తారనే విషయం ఎవరికీ తెలిసే దాఖలాలు లేవు. ఈ కేంద్రం బోర్డుకే పరిమితమైందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

– సారవకోట

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం



పారిశుద్ధ్య సమస్యను సభ దృష్టికి తీసుకెళ్తున్న సర్పంచ్ రమణమ్మ

పోలాకి: రాజకీయాలకు అతీతంగా సమష్టిగా పని చేసి మండలంలోని సమస్యలను పరిష్కరించుకుందామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో తాగునీటి కోసం అనేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారం అవసరమని అభిప్రాయపడ్డారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు మాట్లాడుతూ సమావేశానికి రెవెన్యూశాఖ తరఫున ఎవరూ హాజరుకాకపోవటాన్ని తప్పుబట్టారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. తీరప్రాంత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని సభ్యులు కోరారు. పోలాకి మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకముందే డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ మజ్జి రమణమ్మ తీసుకువచ్చారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీఓ రవికుమార్, వెలుగు ఏపీఎం రాజారావును మండల పరిషత్ తరఫున అభినందించారు. జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి



విజయగౌరిని గెలిపించాలని కోరుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఎల్.ఎన్.పేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్‌శాఖ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. సోమవారం కరకవలస, పూశాం, రావిచంద్రి, కొమ్మువలస, లక్ష్మీనర్సుపేట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో యూటీఎఫ్ శాఖ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు పీడీఎఫ్ బలపరుస్తున్న విజయగౌరి గెలుపులో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీరామచంద్రమూర్తి, ఆడిట్ కమిటీ సభ్యుడు ఎస్.జయరాం, మండల శాఖ ప్రధాన కార్యదర్శులు పి.చిన్నారావు, ఎస్.ఢిల్లేశ్వరరావు, ఎస్.అమ్మినాయుడు, బి.మోహన్‌రావు, వై.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆలయ అర్చకునిపై దాడి అనాగిరికం

నరసన్నపేట: చిలకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, ఆయన కుమారులపై దాడి చేయడం దారుణమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సంఘం ప్రతినిధి భాస్కరబట్ల జగదీశ్వర శర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడికి దిగిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఆమదాలవలస: నిరుద్యోగ యువతకు ఔత్సాహిక పారిశ్రామిక శిక్షణ కార్యక్రమం ఆమదాలవలసలోని టీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 50 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7780167645 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు

ఆమదాలవలస: పట్టణంలోని వేంకటేశ్వర, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో గల హుండీలను ఆలయ ఈఓ తమ్మినేని రవి, శ్రీకాకుళం భీమేశ్వర టెంపుల్ ఈఓ పి.మాధవి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. వేంకటేశ్వర ఆలయంలో పది నెలలకు సంబంధించి రూ.2,13,200, ఉమారామలింగేశ్వర దేవాస్థానంలో రెండేళ్లకు రూ.80,111 ఆదాయం వచ్చిందన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జలుమూరు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి టి.వి.బాలమురళీకృష్ణ అన్నారు. సోమవారం అచ్యుతాపురం పీహెచ్‌సీని పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యాధికారి పూజారి సుజాత, సిబ్బంది ఉన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

హిరమండలం: మండల స్థాయి క్విజ్ పోటీల్లో తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గణిత ఉపాధ్యాయుల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హిరమండలం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, భగీరథపురం హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందించారు.

28లోగా జీవన ధ్రువపత్రం సమర్పించాలి

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఈ నెల 28వ తేదీలోగా ఎస్టీఓ కార్యాలయం, ఏదైనా నెట్ సెంటర్, మొబైల్‌లో లైఫ్ సర్టిఫికెట్ వెంటనే సమర్పించాలని ఎస్టీఓ ఎస్.సువర్ణరాజు సోమవారం తెలిపారు. మంచానికే పరిమితమైనవారు ఉంటే పెన్షనర్స్ సంఘ నాయకులకు తెలియజేస్తే ఇంటికే వచ్చి లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. పెన్షనర్స్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నులి పురుగులను నులిమేద్దాం

జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి ఆల్బెండజోల్ మాత్రలను వైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రలను పంపిణీ చేశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన నులి పురుగులు చనిపోతాయన్నారు. అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు



సరుబుజ్జిలి: నందికొండ అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రల పంపిణీని పర్యవేక్షిస్తున్న డీఐఓ కె.రామ్‌దాసు



బూర్జ: జెడ్పీ హైస్కూల్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



సారవకోట: నులి పురుగుల నివారణపై అవగాహ కల్పిస్తున్న బుడితి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుజనీకుమారి



హిరమండలం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను వేస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్‌బాబు



జలుమూరు: ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అధికారులు



ఎల్.ఎన్.పేట: కరకవలసలో మాత్రలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రామారావు, తురకపేట వైద్య సిబ్బంది



మెళియాపుట్టి: జెడ్పీహెచ్ఎస్‌లో మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఎన్.పి.పండా



పాతపట్నం: కేజీబీవీ విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న గంగువాడ పీహెచ్‌సీ వైద్యురాలు పూర్ణిమ



ఆమదాలవలస రూరల్: పొన్నాంపేట పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న అక్కులపేట వైద్య సిబ్బంది

ఎంఎస్ఎంఈ గుర్తింపు కార్డులతో ప్రయోజనం

- పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ విజయరత్నం



మార్కెట్‌లో సర్వే చేస్తున్న అధికారులు

పొందూరు: వ్యాపారులకు ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా అందిస్తున్న గుర్తింపు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని పరిశ్రమశాఖ జనరల్ మేనేజర్ విజయరత్నం అన్నారు. పొందూరు పంచాయతీ అధికారుల సహకారంతో సోమవారం మార్కెట్‌లో సర్వే నిర్వహించారు. ప్రభుత్వం పరిశ్రమ స్థాపన చేసేందుకు, చిన్న పరిశ్రమల స్థాపనకు, వ్యాపారులకు ఇతర విధానాలు అవలంబించేందుకు ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. పరిశ్రమలశాఖ డీడీ ఉమామహేశ్వరి, ఏడీ రఘునాథ్, ఎంపీడీఓ మన్మథరావు, ఈఓ మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.